క్లుప్తంగా

ఉపాధిహామీ శ్రామికులు ఈకేవైసీ చేయించుకోవాలి



కర్లపాలెం: ఉపాధిహామీ పథకంలో పనిచేసే శ్రామికులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. శనివారం ఎంపీడీవో కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎంవిరాజుపాలెంలో ఉన్న ఉపాధిహామీ పథకంలోని శ్రామికుల ఇళ్ళకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవటంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ఈకేవైసీ దోహదపడుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల పరిధిలో ఉన్న ఉపాధిహామీ పథకంలోని శ్రామికులందరూ ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బన్నారావూరి రాంబాబు ఉన్నారు.

తూముల ద్వారా వర్షపు నీరు తొలగింపు



భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలోని విఠలేశ్వర నగర్ కాలనీ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పక్కన ఉన్న చెరువు పొంగి పొర్లడంతో స్థానిక గృహవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికుల వినతి మేరకు పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి మాష్టినాయక్ ఇరిగేషన్ శాఖాధికారులతో సంప్రదింపులు చర్చించి వెల్లటూరు చానల్ నిలుపుదల చేసి తూముల ద్వారా కాల్వలోకి పంపించారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆయిల్ ఇంజన్‌ల ద్వారా చెరువులో నీటిని దిగువకు విడుదల చేసేందుకు తమవంతు కృషి చేశామని తెలిపారు.

నృసింహ సదనంపై అంతస్తు ప్రారంభం



తెనాలి: పట్టణానికి చెందిన వేదిక్ బ్రాహ్మణ సేవాసమాఖ్య, తెనాలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ఆత్మీయ అభినందన సభను శనివారం సాయంత్రం నిర్వహించారు. నాజరుపేటలోని శ్రీవిద్యాశంకర భారతీ నృసింహసదనం (వేదపాఠశాల)లో జరిగిన సభకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీవిద్యాశంకర భారతీ నృసింహసదనం పై అంతస్తును బుచ్చి రాంప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనందసూర్య, కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, వేదిక్ బ్రాహ్మణ సేవాసమాఖ్య అధ్యక్షుడు అమ్ముణి సుబ్రహ్మణ్యం, ఇతర పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అపర కర్మశాలలో అభివృద్ధి కార్యక్రమాలు



తెనాలి: దాతల సహకారంతో అయితానగర్‌లోని అపర కర్మశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో మూడు గదులను నిర్మించారు. ఇందుకైన వ్యయంలో రూ.18.5 లక్షలు దాతలు విరాళమివ్వగా, మరో రూ.1.50 లక్షలను రోటరీ క్లబ్ నుంచి సమకూర్చారు. శనివారం రోటరీ క్లబ్ బాధ్యులు నిర్మాణం పూర్తయిన గదులను సందర్శించారు. అపరకర్మశాల ఆవరణలో పద్మదనం కోసమని మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకట నారాయణ, అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ, డాక్టర్ జీవనలత, జగదీశ్వరాంబ, రైతు నాయకుడు ఈదర పూర్ణచంద్ పాల్గొన్నారు. క్లబ్ సభ్యుడు, దాత అయిన తాళ్లూరి సుబ్బారావును సత్కరించారు.

కోడిపందేల నిర్వాహకులు అరెస్టు

ప్రత్తిపాడు: కోడి పందేలు నిర్వాహకులను వట్టిచెరుకూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. వట్టిచెరుకూరు పోలీస్ స్టేషను పరిధిలోని వింజనంపాడు-చమళ్లమూడి గ్రామాల మధ్య వ్యవసాయ భూముల్లో కోడి పందేలు నిర్వహించబోతున్నారన్న సమాచారంతో వట్టిచెరుకూరు సీఐ రామానాయక్ దాడులు చేశారు.

వైఎస్సార్ సీపీ అభ్యున్నతి కోసం నేతలు కృషి చేయాలి

- వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్‌బాబు
- భట్టిప్రోలులో పార్టీ సమీక్ష సమావేశం
- క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న అశోక్‌బాబు, పక్కన మండల పరిశీలకులు పెరికల పద్మారావు, పార్టీ నాయకులు

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ అభ్యున్నతి కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు పిలుపునిచ్చారు. భట్టిప్రోలు మండల పార్టీ సమీక్ష సమావేశం అద్దేపల్లి షాదీఖానా ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించారు. మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం పార్టీ మండల కన్వీనర్ పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిశీలకులుగా పెరికల పద్మారావు వ్యవహరించారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామ కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి రెండు పంచాయతీలకు ఒకరిని పరిశీలకులుగా ఉండటం జరిగిందన్నారు. మండలంలోని అన్ని పంచాయతీలకు పరిశీలకులను నియమించడంతో పాటు వేమూరు, కొల్లూరు, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు పంచాయతీలకు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్ ఉపయోగించి ఫిర్యాదు నమోదు చేయవచ్చునన్నారు. మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా నాడు-నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు గుర్తు చేశారని పేర్కొన్నారు. ప్రతి పేదవాడి ఉచిత వైద్యం అందించాలని, విద్యా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు నూతనంగా ఏర్పాటు చేస్తే సీఎం చంద్రబాబుకి కూటమి ప్రభుత్వ నాయకులకు మాత్రం అసలు జగన్ కళాశాలలు చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవ చేశారు. కళాశాలలు కనపడని కూటమి నాయకులకు చంద్రబాబు దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలని అశోక్‌బాబు ఎద్దేవా చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి కోడ్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, వివిధ పార్టీల విభాగాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ సీఎంకు పాఠశాలల రూపురేఖలు గుర్తు చేశారు.

కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



కోటి సంతకాల సేకరణ ప్రచార పత్రికలను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): ప్రభుత్వ కళాశాలల నిర్మాణంలో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎంపీపీ షేక్ బాజీ, మాజీ జెడ్పీటీసీ నారపరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పిట్టలవానిపాలెం మండలంలోని భవనంవారిపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ గోడపత్రికలను వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా బాజీ, నారపరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని మెడికల్ కళాశాలను,వైద్యశాలలను ప్రైవేటు పరంగా కాపాడుకునేందుకు బాపట్ల నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి నాయకత్వంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో నాయకులు, కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఏట్ర అశ్వినీరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మంప విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు షేక్ మౌలాలీ, ఎస్సీ సెల్ నియోజక వర్గం అధ్యక్షులు బడుగు ప్రకాష్, పార్టీ నాయకులు దొంతిరెడ్డి కోటిరెడ్డి, కుంటం ప్రసన్నరాజు.చేబ్రోలు కృపానందం, దొంతిబోయిన జయభారత్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు భట్టిప్రోలులో క్యాన్సర్ అవగాహన సదస్సు

భట్టిప్రోలు: కాంటినెంటల్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ డిజిటల్ రూంలో ఆదివారం వైద్యులు హరీష్ అంకాలజీ సర్జన్ (హైదరాబాద్) క్యాన్సర్ అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3:30 గంటలకు ఈ సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కామన్ జోనింగ్‌పై అభ్యంతరాలు తెలియజేయండి

తెనాలిఅర్బన్: ఒకే జోనింగ్ రెగ్యులేషన్ ఉండాలనే ఉద్దేశంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారు కామన్ జోనింగ్ నిబంధనలను తయారు చేసి గత నెల 29న అత్యవసర సంచికలో ప్రచురించిందని మున్సిపల్ కమిషనర్ రామఅప్పల నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన కాపీలను తెనాలిలోని మున్సిపల్ కార్యాలయం, వార్డు సచివాలయాల్లోని నోటీసు బోర్డులలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. దీనిని అందరు పరిశీలించి సూచనలు,సలహాలు, అభ్యంతరాలు dtc p.a p@f-m-ai .com కు మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు.

వైభవంగా కలశ ప్రతిష్టాపన



ప్రతిష్టాపన మహోత్సవంలో స్వామీజీ

తెనాలి: పట్టణ నాజరుపేటలోని శ్రీశృంగేరి శ్రీవిరూపాక్ష పీఠపరిపాలిత శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో తూర్పువైపున నూతనంగా నిర్మించిన గాలిగోపురం, కలశ ప్రతిష్టాపన శనివారం వైభవంగా జరిగింది. శ్రీశృంగేరి విరూపాక్ష పీఠపాలిత శ్రీపరశివానంద భారతిస్వామి చేతులమీదుగా ఉదయం 9.09 గంటలకు ప్రతిష్టా మహోత్సవం నిర్వహించారు. కుంభాభిషేకం జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కె.చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షించిన ఈ వేడుకలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, రమేష్ దంపతులు 'కళారత్న' కాటూరి వెంకటేశ్వరరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

గుంటూరు రూరల్: జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలోని రైతులకు, అధికారులకు, సిబ్బందికి శనివారం సమాచార హక్కు చట్టం 2025పై అవగాహన సదస్సును నిర్వహించారు. నగర శివారుల్లోని లాంఫాంలో నిర్వహించిన సదస్సులో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ సమాచారం అంటే ఏంటి, సమాచారం కోసం ఏవిధంగా దరఖాస్తు చేసుకోవచ్చు, దరఖాస్తు దారుని హక్కులు, సమాచారాన్ని ఎన్ని రోజులలో అందించాలి అనే విషయాలు వివరించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయం పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, సత్యనారాయణ అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

హాస్టల్లో పారిశుధ్య పనులు



హాస్టల్ భవనంపై ఉన్న వాటర్ ట్యాంక్‌ను క్లీన్ చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు: పెదనందిపాడు మండలం అన్నపర్రులోని హాస్టల్‌లో 54 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో గ్రామ సర్పంచి చొరవతో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు కల్లూరి అన్నపూర్ణ, నాగేశ్వరరావు (నాగు) తన సొంత ఖర్చులతో అపరిశుభ్రంగా ఉన్న హాస్టల్ ఆవరణలో ఎర్ర మట్టి తోలించారు. అంతేకాకుండా హాస్టల్ భవనంపైన అత్యంత దారుణంగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను క్లీనింగ్ చేయించారు. అనంతరం హాస్టల్ భవనంపై అధ్వానగా ఉన్న ఫ్లోరింగ్ మొత్తాన్ని ప్రత్యేకంగా పరిశుభ్రం చేయించారు. హాస్టల్ పరిసరాల్లో ఉన్న పిచ్చిచెట్లు, మురుగును శుభ్రం చేయించడంతో స్థానికులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాలికా విద్యతోనే సమాజ అభివృద్ధి

చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ ట్రస్ట్ ప్రోగ్రాం మేనేజర్ ఎం.శ్రీనివాసరావు



పోటుమెరక గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

రేపల్లె: బాలికల విద్యతోనే సమాజం పరిపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ ట్రస్ట్ ప్రోగ్రాం మేనేజర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలల స్నేహ గ్రామాలైన కారుమూరు, పెనుమూడి, చోడయపాలెం, విశ్వేశ్వరం, పిరట్లంక, తుమ్మల, నల్లూరిపాలెం, పోటుమెరక గ్రామపంచాయతీలలో గ్రామ బాలల రక్షణ కమిటీ బాలల పంచాయతీ అధ్యక్షతన శనివారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలికలు ప్రభుత్వం తమకు కల్పించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలను విద్యకు దూరం చేసినా, బాల్య వివాహాలు చేయాలని చూసినా, ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడిన చట్టరీత్య నేరస్తులన్నారు. బాలికలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. మహిళలకు మానసికంగా ఎంతో శక్తివంతులని, నేడు గగనాన్ని చుట్టివచ్చే స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. బాలికలకు తమకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా 1098కిగాని, 181కిగాని ఫోన్ చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో బాలికలచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ ట్రస్ట్ క్లస్టర్ ఫీల్డ్ కోఆర్డినేటర్ రత్నా ఏంజెల్, ఝాన్సీ లక్ష్మి, క్రియేట్ లెర్నింగ్ వలంటీర్స్, బాలికలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


పేదలకు దూరమవుతున్న వైద్యసేవలు

వైద్యులు లేక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు




పెరవలి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వేమూరు: మండల ప్రాథమిక వైద్య శాలల్లో పని చేస్తున్న వైద్యులు బంద్ చేయడంతో పేద ప్రజలు వైద్యానికి దూరమవుతున్నారు.. వేమూరు మండలంలోని 11 ప్రాథమిక వైద్యశాలలు ఉన్నాయి. ప్రతి ప్రాథమిక వైద్య శాలు ఇద్దరు వైద్యులను ప్రభుత్వం కేటాయించింది. వేమూరు మండలంలోని పెరవలి మండల ప్రాథమిక వైద్య శాలల్లో ఇద్దరు, అమర్తలూరు మండలంలో మూడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. మూల్పూరు, అమర్తలూరు, ఇంటూరు, చుండూరు మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. యడ్లపల్లి చుండూరు, వేటపాలెం, కొల్లూరు మండలంలోని రెండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. కొల్లూరు, దోనేపూడి, భట్టిప్రోలు మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వెల్లటూరు, భట్టిప్రోలు, ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు బంద్ చేయడంతో పేద ప్రజలకు వైద్య అందక ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు లేక పోవడంతో రోగులు కూడా వైద్యశాలకు రావడం లేదు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో పేద ప్రజలు ప్రవేటు వైద్య శాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో పేద ప్రజలకు వైద్య ఖర్చులు భారంగా మారాయి. వైద్యం కోసం భారీగా నగదు ఖర్చు చేసే పరిస్థితి తమకు లేదని పలువురు రోగులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మూల్పూరు ఆరోగ్య కేంద్రం



యడ్లపల్లి ఆరోగ్య కేంద్రం

తురకపాలెం బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

గుంటూరు రూరల్: రూరల్ మండలం తురకపాలెంలో నాలుగు నెలలు కాలంలో 29 మరణాలు సంభవించటం ఎంతో బాధాకరమని బాధిత కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల వీరాస్వామి శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలను అలక్ష్యం చేయటం బాధాకరమన్నారు. ఆసుపత్రుల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

కోటి సంతకాలతో.. కూటమిలో మార్పురావాలి

వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాపట్ల: మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయవద్దంటూ వైఎస్సార్ సీపీ చేపడుతున్న కోటి సంతకాల కార్యక్రమంతోనైనా కూటమి ప్రభుత్వం తీరుమార్చుకోవాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయటం సరికాదన్నారు. ఈపాటికే బాపట్ల వంటి చోట్ల కళాశాల బెస్మెంట్ పనులు కూడా పూర్తి చేసినట్లు వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నడిసే కళాశాలలను పూర్తిగా కార్పొరేట్ చేతుల్లోకి వెళ్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మరుప్రోలు ఏడుకొండల రెడ్డి, ఎల్లావుల కొండలు, రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నక్కా వీరారెడ్డి, జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలగడ్డ చెంచయ్య, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి, జోగి రాజా, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, ఇనగలూరి మాల్యాద్రి, అట్ల నాగేశ్వరరెడ్డి, మనం పాపారావు, బడుగు ప్రకాశ్, కటికల యోహోషువా, నక్కల పవన్‌కుమార్, పులి శ్రీను, పాలపర్తి గోపికృష్ణ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలకు రూ. 47 వేల కోట్లు ఖర్చు

కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్



చక్రాయపాలెంలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు పెమ్మసాని, మనోహర్

కొల్లిపర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో రూ. 47 వేల కోట్లను సంక్షేమ పథకాలకు ఖర్చు చేశామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మండలంలోని చక్రాయపాలెంలో శనివారం రూ.81 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ (కల్యాణ మండపం) ప్రారంభంతో పాటు అత్తోటలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలసి శంకుస్థాపన చేశారు. కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ఎన్నికల్లో తనకు 95 శాతం ఓట్లు వేసి గెలిపించిన ఏకైక గ్రామం చక్రాయపాలెమని కొనియాడారు.

కల్యాణ మండపం చుట్టూ కాంపౌండ్ వాల్, డొంక రోడ్డు, డ్రెయినేజీలు నిర్మాణ సమస్యలను గ్రామస్తులు తన దృష్టికి తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఎంపీ నిధుల నుంచి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి, విద్యుత్ ట్రాన్స్‌ఫారం కోసం రూ.13 లక్షలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మిగిలిన సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర మంత్రి మనోహర్ మాట్లాడుతూ రాబోవు 15 రోజుల్లో దేశంలో ఎన్నడూ లేని విధంగా విశాఖపట్నంలో గూగుల్ సంస్థ రూ.87 వేల కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చందు నాగేశ్వరరావు, అమ్మిశెట్టి హరికృష్ణ, సీతారామయ్య, హరికృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అందరిలో ఆధ్యాత్మిక చింతన అలవడాలి

జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు

రేపల్లె: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన ఉండాలని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. మండలంలోని పోటుమెరక జలార్తమ్మ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఆధ్యాత్మిక చింతన కలిగిన వారిలో మానసిక ప్రశాంతత లభిస్తుందని, నిత్యం దైవనాసమస్మరణ చేయటంతో దైవ కృపకు పాత్రులు కాలగలరని సూచించారు.

నిత్యం దేవుని ఆరాధన చేయటంతో పాటు ధర్మ మార్గాన్ని ఎంచుకుని, సాటి వారికి సాయం చేసే గుణాన్ని అలవరుచుకోవాలని సూచించారు. మానవసేవే మాదవ సేవని గుర్తు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి కీర్తనలు, విష్ణు సహస్రనామం, గోవింద నామ స్మరణలతో పాటు వివిధ భక్తిగీతాలు ఆలపించారు. గరికపాటి రేణుకస్వామి, కట్టా మహేష్‌ల ఆర్థిక సహకారంతో అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, రేపల్లె శ్రీకృష్ణయ్య, మాదివాడ బుజ్జి, కామరాజుగడ్డ లోకేష్ బాబు, అర్చకులు కట్ట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు వెంటనే విడుదల చేయాలి

వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పట్టెం శ్రీనివాసరావు



రేపల్లె: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలోని శ్రీ గణపతి చేనేత సహకార సంఘం సభ్యులు గత 13 రోజులు నుంచి రిలే నిరాహారదీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవటం బాధాకరమని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పట్టెం శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వం నుంచి వారి సంఘానికి రావలసిన రూ.3.85 కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చిన తరువాత ప్రకటనలకు తప్ప చేనేత కార్మికులకు, సంఘాలకు ఎలాంటి హామీలు నెరవేర్చలేదని స్పష్టం చేశారు. ఈ వైఖరి ఇలాగే కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయని, చేనేత కార్మికులు ఉద్యమ బాటపడతారని, వెంటనే చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగర చేనేత సహకార సంఘ సభ్యులకు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తెనాలి రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నందులపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వి.ప్రియాంక ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని పలు వసతి గృహాల్లో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో జిల్లా వైద్యాధికారి సూచనల మేరకు నాజర్ పేట లో గల ఎస్సీ బాలుర వసతి గృహం, సంకా వారివీధిలోని బీసీ బాలుర వసతి గృహం, దేవి చౌక్ సోషల్ వెల్ఫేర్ కాలేజీ బాలుర వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ వంటగదుల శుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత పై డాక్టర్ ప్రియాంక పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ తాడిబోయిన ఆదినారాయణ, పిడపర్తిచెంచయ్య, మరియదాసు, ఆరోగ్య సిబ్బంది ఎస్ ఉమాకాంత్, ఎ.బాలచంద్రమౌళి, సి.హెచ్.ప్రసన్న పుష్పలత, చెన్ను చంద్రమ్మ, కె.అక్కమ్మ, టి.నాగలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.